
# అరణ్యంలో అర్ధరాత్రి

పెద్దిభొట్ల సుబ్బరామయ్య



ఇది ఎంత భయంకరమైన అరణ్యం!

ఎన్ని అందమైన, రంగురంగుల దీపాలు!

ఇక్కడ ఎన్నిరకాల మృగాలు!

• • •

నగరంలో వెలుగుతున్న వందలాది వేలాది దీపాలముందు పౌర్ణమివెన్నెల వెలా తెలా పోతున్నది. చంద్రబింబం పూర్తిగా పాలిపోయి పలుచని మబ్బుతెరలలో వొదిగి పోతున్నది

టక్....టక్ ...టక్....గుర్రం నెమ్మదిగా అడుగులు వేస్తున్నది.

తలగుడ్డతీసి విదిలించి మళ్లా తలచుట్టూ చుట్టుకుని దుప్పటికింద బీడీకోసం వెదికాడు రాఘవులు. ....ఒక్కటే ఉన్నట్టున్నది. తీసుకుని వెలిగించాడు....గుండెలనిండా పొగ పీల్చి బైటికి వొదిలాడు....

ఈ జైలుగోడ మూడు నిలువులఎత్తున్నది. దాని తలఎత్తి చూస్తే ఆగోడపైన వెన్నెలలో మిలమిల లాడుతున్న గాజు పెంకులు కనిపిస్తాయి. ఆగోడ బాగాలావు పాటి కొండరాళ్ళతో కట్టారు. దుర్భేధ్యంగా కట్టారు. అటునుంచి యిటు ఒక్క పురుగైనా వచ్చేందుకు వీల్లేకుండా కట్టారు. అటువైపు కాపలి ఎవరోగంటలు కొడుతున్నారు. రాఘవులు బండిని నెమ్మదిగా నడిపిస్తూ గంటలధ్వని విన్నాడు....పదకొండు గంటలు మ్రోగాయి. తర్వాత అటువైపునుంచీ ఏధ్వనీలేదు.....

చురచుర మండుతున్న బీడీముక్కను విసిరి అవతల పారేసి అఖరిపొగను ఎక్కడఅయిపోతుందో అనే భయంతో కొద్ది కొద్దిగా వొదులుతూ "అవునుమరి....పదకొండుగంటలు కాకేం?" అనుకున్నాడు రాఘవులు ...

గుర్రం నడుస్తూనే ఉంది. గుంటలు పడిన రోడ్డుమీద బండి చప్పుడు చేసుకుంటూ ముందుకు పోతున్నది.

రాఘవులు వీధి చివర బండి ఆపాడు. గుర్రం ఒక్కసారి సకిలించి తర్వాత ఓపిక లేకనో ఏమోనిశ్శబ్దంగా నిలబడిపోయింది. రాఘవులు క్రిందికి దిగి బండ్లో దుప్పటి క్రిందనుంచి కొంచెం పచ్చిగడ్డితీసి గుర్రం నోటికందిస్తూ నిలబడ్డాడు.

వీధి దీపం మత్తుగా వెలుగుతున్నది. దానిచుట్టూ సన్నని పురుగులు గిరికీలు కొడుతున్నాయి. ఎక్కడా గాలిలేదు.

రాఘవులు తలగుడ్డతీసి విసురుకుంటూ జైలుగోడమీదికి చూశాడు. అంతలో అతనికి తనయిల్లు గుర్తుకువచ్చింది. ఇంటితో పాటు యింట్లో ఉండే తన భార్యా, [అయ్యో! మా లచ్చిమి మూడేళ్ళకింద ఎల్లాగుండేదః గుమ్మటం లాగుండేది... గుమ్మడి పువ్వులాగుండేది.) పెళ్ళికెదిగిన తనకూతురూ (రత్తాలు బాగాపొడుగెదిగింది ఈ ఆడపిల్లలో యిదే తంటా.........ఉన్నట్టుండి మన కళ్ళముందే ఎదిగిపోతారు] గుర్తుకొచ్చారు. మా లచ్చిమి కళ్ళలోమునపటి మిలమిలలన్నీ ఏ నక్షత్రాలను కలిశాయో! ఇప్పుడాకళ్ళుగుడ్డిదీపాల్లాగున్నాయి. ఆకళ్ళలో జీవంలేదు. ఇహరత్తాలు....దానికి పద్దెనిమిదేళ్లు నిండాయి. పోయిన నెల్లో స్వతంత్రదినోత్సవం వొచ్చిందేః ఆనాటికి సరిగ్గా పద్దెనిమిదేళ్ళు .. పద్దెనిమిళ్ళ పిల్ల ఎలా వుంటుందిః అలాగేవుంటుందిరత్తాలు. మూడేళ్ళ క్రిందట తమఊరువొదిలి వచ్చే దాకా. రత్తాలు మామూలుగానే ఉండేది. పచ్చని పొలాల్లో పంటకాలవల వెంబడి గువ్వపిట్టలా తిరుగుతూ ఉండేది. రివ్వు రివ్వున ఎగురుతూ ఉండేది. అక్కడి ఆ కాస్త పొలమూ పోవడంతో, తాము ఇక్క-

దికి రావడంతో ఆ పిల్లలో బాగా మార్పు వొచ్చింది. ఎల్లలెరుగని పల్లెలో యిచ్ఛ మేరకు విహరించే పక్షిలాటిదాని పంజరంలో పెట్టినట్టయింది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టు కూర్చుని ఉంటుంది. బహుశా కలలుకంటూ ఉంటుందేమో! మా లచ్చిమికి రెండుసార్లు వరసాగ్గా కడుపులు పోయి ఆరోగ్యం బొత్తిగా చెడయిపోయింది. మనిషి కానుగపుల్లలా సన్నగా తయారైంది. కదిలితే, మెదిలితే ఆయాసం గుండెదడ,....దాంతో యింటిపనీ బయటి పనీకూడా రత్తాలుపాలబడింది. సందు చివరలో ఉన్న దుకాణానికిపోయి రోజూ పూట బియ్యం అపూట కొనుక్కొ రావడమూ, ఉడకేసి పడెయ్యడమూ అంతా రత్తాలేచేస్తూ ఉంటుంది.

రాఘవులు గడ్డం సవరించుకున్నాడు. గుర్రం జూలు నిమిరాడు. తర్వాత "మరోక్క బీడీముక్క ఉంటే ఎంత బాగుణ్ను" అనుకున్నాడు. అలా అనుకుని మళ్ళీ బండ్లో దుప్పటిక్రింద వెదికి చూశాడుకూడా. కాని అటువంటిదేమీ చేతికి తగల్లేదు. దాంతో అతడు విసుక్కున్నాడు "ఛ" అనుకున్నాడు. తర్వాత మళ్ళీ బండిఎక్కి "ఛల్" అని గుర్రాన్ని కదిలించి మళ్ళీ వీధిమలుపుతిప్పాడు. ఇది దక్షిణంనుంచి బండివొచ్చేటైము.... అందుకని స్టేషనుకు చేరుకున్నాడు. ఒచోట బండి ఆపాడు.

అదేంచిత్రమో, ఈ స్టేషను నిరంతరం కోలాహలంగా ఉంటుంది. లెక్కలేనంత మంది జనం పిల్లాపాపా, ఆడామగా ఎటెటు పోవలసినవారో అందరూ ఆ హాల్లో ఎవరికి తోచినట్టువారు అడ్డదిడ్డంగా పడుకుని ఉంటారు. ఇరవైనాలుగ్గంటలూ అక్కడ హడావిడిగా ఉంటుంది. పట్టపగలులా లైట్లవెలుతురు. బయట సోడాబళ్ళవాళ్ళ కేకలు. రిక్షావాళ్ళ సందడి.... ప్రయాణీకుల అలజడి...

రాఘవులు మనుషులను తప్పుకుంటూ ముందుకువెళ్ళి మెట్లక్రింద నిలబడ్డాడు. అప్పటికే అక్కడ చాలామంది రిక్షావాళ్ళు మూగివున్నారు. మెట్లమీద ఇద్దరు టిక్కెట్ కలక్టర్లు తెల్లటిదుస్తులలో కూర్చునివున్నారు.

అంతలో మెట్లమీద ప్రయాణీకుల కాళ్లు కనిపించాయి. ఒకరూ, యిద్దరుగా ముగ్గురూ నలుగురుగా. అయిదుగురూ ఆరుగురుగా ప్రయాణీకులు మెట్లుదిగి వస్తున్నారు. కొందరిచేతుల్లో సూట్‌కేసులు, కొందరిచేతుల్లో సంచులు, మరికొందరి చేతుల్లో మరచెంబులు. ఇంకా కొందరి చేతుల్లో పిల్లలు, ఆడవాళ్ళూ మగవాళ్ళూ పిల్లలూ ప్రయాణ బడలికతో వాడిపోయి అలసటతో మెట్లుదిగి వస్తున్నారు.

రిక్షావాళ్ళలో గొడవ బయల్దేరింది. "అదుగో. ఆ నల్లసూట్ కేస్ నాది...." "ఈ పక్క పేకు వెళ్ళేనాది...." అని అరుచుకుంటూ ముందుకుచొచ్చుకువచ్చి ప్రయాణీకులు ఆఖరిమెట్టు దిగీ దిగకముందే "రండిరండి బాబూ!" "రండిరండి అమ్మగారూ!" అంటూ ఈగల్లా ముసురుతున్నారు...

రాఘవులుకూడా ఓపిక తెచ్చుకుని పెద్దగా "అమ్మా! గుర్రబ్బండీ.... అయ్యా గుర్రబ్బండీ.... నిమిషాలమీదెళ్ళిపోతాం.... రండిరండీ..." అని అరుస్తున్నాడు. అతనికితెలుసు ఒకరూ యిద్దరూ అయితే బండిఎక్కరు. రిక్షాలమీదే వెళ్ళిపోతారు. అందుకని ఎవరైనా ఒక కుటుంబంలా కనిపిస్తే వారివెంటాడి బండి ఎక్కమని ప్రాధేయపడుతున్నాడు.

ఒకలావుపాటివ్యక్తి భార్యా పిల్లలతో బండీ ఎక్కేందుకు సిద్ధపడ్డట్టే అనిపించింది. ఆ మనిషి వెంటనే నడుస్తూ రాఘవులు ప్రాధేయపడుతున్నాడు. కాని అంతలో ఒక కుర్రవాడు "నాన్నా! అదుగో మామయ్యగారొచ్చేరు...." అనడమూ ఒకపెద్దమనిషి అక్కడికేవచ్చి "అయ్యో ఇంకా నయం... మిస్సయిపోయేవాణ్ణి - అదుగో, అక్కడ మన కారుంది నడవండి....'' అనడమూ జరిగాయి. వాళ్ళందరూ పోలోమంటూ అక్కడ ఆగివున్న అందమైన కారువైపు నడిచి వెళ్ళిపోయారు. రాఘవులు వెనుదిరిగి చూస్తే ప్రయాణీకుల అలజడి బాగా తగ్గింది. అప్పటికి టిక్కెట్ కలెక్టర్లు యిద్దరూ మళ్లీ తీరిగ్గా హాయిగాకూర్చునివున్నారు. రిక్షాలు చాలాభాగం గణగణమని గంటలు మ్రోగించుకుంటూ వెళ్ళిపోయాయి.

రాఘవులు బండిపక్కనే నిలబడ్డాడు, గడ్డం తడుముకున్నాడు, తర్వాత మళ్లీ "ఒక బీడీముక్క ఉంటే ఎంతబాగుణ్ను" అనుకున్నాడు. తర్వాత "లేకపోతేమాన్లే, బతకలేనా?" అనికూడా అనుకున్నాడు. తర్వాత బండి ఆనుకుని నిలబడి ఉండగా మళ్ళీ అతనికి మాలచ్చిమీ, కూతురూ జ్ఞాపకంవచ్చారు. రాఘవులు నిన్నసాయంకాలంఅనగా బండి కట్టుకుని యిల్లువిడిచి వొచ్చాడు. మళ్ళి యింటికేపోలేదు. ఎలా పోతాడు? ఈ ఇరవైనాలుగ్గంటలలో అతనికి ఒకే ఒక్క బాడిగ దొరికింది. అప్పుడు వొచ్చిన అరవైపైసలూ సాదరు కిందా, బీడీముక్కలకిందా, టీనీళ్ళకిందా చెల్లిపోయాయి. ఇంటికి పోవాలంటే కనీసం కిలో బియ్యానికైనా డబ్బుతీసుకుపోకపోతే ఎలా? వొట్టిచేతులతోవెళ్ళి ఆ బాధ చూసే కంటే వెళ్ళకుండా ఉంటేనే మంచిది.

రాఘవులు నెమ్మదిగా కదిలి గుర్రం ముందుకువచ్చాడు. ఒక్కక్షణంసేపు దాని జూలు నిమురుతూ ఉండిపోయాడు. తర్వాత బండిఎక్కి కళ్ళెం పట్టుకుని అదిలించాడు. బండి మెల్లిగా ముందుకుసాగింది.

రాఘవులు అంతలో 'ఛ: ఎందుకిట్టా తిరగడం? గుడిసెకెళ్లి పడుకుంటేపోదూ!' అనుకున్నాడు. రత్తాలు ఈపాటికి (తినో తినకనో) మాంచి నిద్దర్లో ఉంటుంది, మాలచ్చిమికూడా నిద్రపోతూఉండొచ్చు. లేకపోతే నిద్రకళ్ళతో తనకోసం ఎదురు చూస్తూనూ ఉండొచ్చు. సాయంకాలం వీధి చివరిదుకాణంలో ప్రాధేయపడి రత్తాలు బియ్యం అరువు సంపాయించి ఉండొచ్చు. మాలచ్చిమికూడా తనకోసం ఏమీ ఎంగిలి పడకుండా ఎదురుచూస్తూ ఉండొచ్చు....

రాఘవులు పక్కగూటిలోనుంచి చర్నాకోలలాగి చక్రంలోపెట్టి "టకటక"మని. శబ్దంచేశాడు. గుర్రం వేగంగా దౌడుతీయడం ప్రారంభించింది, సెంటర్లో. విగ్రహం చుట్టూ ప్రదక్షిణచేసి బండి కాలవగట్టునే దాదాపు నిర్మానుష్యంగా ఉన్నరోడ్డువెంట కదిలిపోతున్నది. ఎవరిదో పెద్దమేడ... ఇంకా పెనలైటు వెలుగుతూనేవుంది.... ఆ పక్కనే రాత్రి డ్యూటీ మనుషులెవరో యింకా పనిచేస్తున్నారు. ఒక పోలీసు సైకిల్‌మీద దూసుకుపోతున్నాడు.... ఈ ఆవరణ పెద్దది.... లోపల మధ్యగా ఒక చిన్న బంగళా.... అందులో

ఏ అదృష్టవంతులుంటారో ... ఈ చెట్టు మీద పక్షులు ఒకటే గోలచేస్తున్నాయి.... ఇది గవర్నమెంటు ఆసుపత్రి. బయట ఇద్దరు ముగ్గురు మనుషులు ... వాళ్ళు ఎంతగా ప్రాధేయపడుతున్నా లోపలికి వెళ్ళనివ్వని కాపలామనిషి....

అంతలో రాఘవులు వెనుదిరిగి చూశాడు. ఎవరో చేయిఎత్తి రమ్మని సైగ చేస్తున్నారు. రాఘవులు బండిని అటు సరిగా చూశాడు. ఆ వ్యక్తి తెల్లగుడ్డలు తొడుక్కొనిఉన్నాడు. చప్పట్లుకొట్టి "రిక్షా-రా" అనడం వినిపించింది.

బండి వెనక్కి మళ్ళింది. రాఘవులు వేగంగా బండిని ఆసుపత్రి ముందుకు రానిచ్చి ఆపాడు. గుర్రం సకిలించి నిల బడింది. రాఘవులు బండిదిగి ఆ వ్యక్తి దగ్గరికి వస్తూ "బాబూ! పిలిచారు! రండి బాబూ ఎక్కండి.... ఎల్లిపోదాం" అన్నాడు. అంతలో మరో వ్యక్తి అక్కడికి వచ్చి "బండీ వొచ్చినట్లుందే.... మాట్లాడావా?" అని అడిగాడు. మొదటివ్యక్తి "ఏదీ— ఇంకాలేదు...." అన్నాడు.

రాఘవులు "రండిబాబూ! మీకు బేరా లేమిటీనాకు? మీకు తోచినం పడే య్యండి ..." అంటున్నాడు. అంతలో ఆ వ్యక్తి అతన్ని పక్కకులాగి దగ్గరగా వచ్చి నెమ్మదిగా "పడమటి లంక వెళ్ళాలి...." అంటున్నాడు.

రాఘవులు "ఎంతసేపు బాబుగారూ! ముందు మీరెక్కండి." అన్నాడు.

ఆ వ్యక్తి "ఉండవోయ్! చెప్పేది వినవేం. మా నాన్నగారు సాయంకాలం లారీకిందపడ్డారు...." అంటుండగా అతని గొంతు బొంగురుపోయింది.

రెండోవ్యక్తి "నువ్వుండరా... ఏమిటా చెప్పడం—" అంటూ రాఘవులువంక తిరిగి "ఏమయ్యా! పీనిగను బండ్లో వేసుకు పోవాలి... పడమటలంక.... ఎంత కావాలో అడుగు." అన్నాడు.

రాఘవులు అదిరిపడ్డాడు. అప్రయ త్నంగా ఒక్క అడుగు వెనక్కు వేశాడు. వెంటనే మొహం తుడుచుకుంటూ "వొద్దు లేండిబాబూ! నే నెల్లిపోతాను. ఇంకో బండి మాట్లాడుకోండి, ఇంటి కెళ్ళాలి...." అన్నాడు.

ఆ వ్యక్తి వినిపించుకోకుండా "అయిదు రూపాయలిస్తాం...." అన్నాడు.

రాఘవులు తల అడ్డంగాఊపి బండి దగ్గరికి వచ్చాడు. ఆ వ్యక్తుల్లో ఒకడు అక్కడి కాపలా మనిషితో మాట్లాడు తున్నాడు. రెండోఆయన "ఏంటయ్యా, అలా వెళ్ళిపోతావేం? ఏం కొంపమునుగు తుందని." అంటున్నాడు, మళ్ళీ దగ్గ రికివచ్చి "నీ ఆర్రూపాయలు చేసుకో." అన్నాడు.

రాఘవులు ఒక్కక్షణం ఆలోచించాడు. తర్వాత గడ్డం నిమురుకుని "సరే...." అన్నాడు. అంతలో మొహాన పట్టిన చెమ టను తుడుచుకున్నాడు. ఆ వ్యక్తులిద్దరూ లోపలికి వెళ్ళారు. వాళ్ళు తిరిగిరావడానికి రెండుమూడు నిమిషాలుపట్టింది. ఈలోపల రాఘవులు ఆలోచించాడు. "చెప్పాపెట్ట



పెద్దిభొట్ల
సుబ్బరామయ్య

కుండా వెళ్ళిపోతే...." అనుకున్నాడు. కాని మనసొప్పలేదు. పైగా ఆర్రూపాయల బేరం.... రేపల్లా కళ్ళుమూసుకు గడపవచ్చు. మహాఅయితే అరగంట.... కాకపోతే ముప్పావుగంట. కళ్ళుమూసుకుంటే సరి పోతుంది. రూపాయలు చేతుల్లో పడ తాయి. అంతగా అయితే ఆ దుప్పటితీసేసి రేపు ఉతికేస్తే సరిపోతుంది.... అంతలో లోపలినుంచి ఆ వ్యక్తులిద్దరూ వచ్చారు. వారికి కళ్ళు ఎర్రగా ఉన్నాయి. లోపలినుంచి ఇద్దరు మనుషులు శవాన్ని మోసుకుని వచ్చారు. భద్రంగా బండిలో పడుకో బెట్టారు, తర్వాత ఆ యిద్దర్నీ సమీపిం చారు. ఒకవ్యక్తి జేబులోనుంచి ఏదోనోటు తీసి వారికిచ్చాడు. వాళ్ళు చాలదని సణిగి నట్టున్నారు. మరొక చిన్ననోటు తీసి యిచ్చాడు. వాళ్ళలోపలికివెళ్ళి పోయారు.

ఒక వ్యక్తి రాఘవులు దగ్గిరికివచ్చి "రాబందులు...." అని గొణుక్కుంటూ పెద్దగా "పదవయ్యా నువ్వు పద....నెమ్మ దిగాపద ... మేము నీ వెనకనేవస్తాం." అన్నాడు.

బండి కదిలింది. ఆ యిద్దరూ సైకి ళ్ళెక్కి వెనకనే వస్తున్నారు. వారిలో వారేదో మాట్లాడుకుంటున్నారు. ఆ మనిషి యాభై ఏళ్ళవాడు....ఆనాడు బాగా తాగి రోడ్డుకడ్డంగా నడుస్తూ వెళ్ళి లారీక్రింద పడ్డాడు. పెద్దగొడవయిపోయింది. లారీ డ్రయివరు పరారీఅయిపోయాడు. పోలీ సులు శవాన్ని తీసుకుపోయారు. హాస్పి టల్లో దాన్ని ముక్కలుముక్కలుగాకోసి పరీక్షలుచేశారు. తర్వాత మళ్ళీ ఆదరాబాద రాగా కుట్టి అప్పగించారు. దీనికి ఎందరి కాళ్ళో పట్టుకోవలసి వచ్చింది, ఎంతో డబ్బు తగలేయవలసివచ్చింది.

రాఘవులు బండి నడుపుతూ ఆకాశం లోకి చూశాడు. చంద్రబింబం పలుచని మబ్బుతెరలలో ప్రయాణం చేస్తున్నది. ఆకాశమంతటా తెల్లగా దూది ఏకిపడేసి నట్టు పలుచని తెల్లని మబ్బులు—

ఒకచేత్తో గడ్డంనిమురుకుంటూ "ఒకబీడీ వుంటే ఎంత బాగుణ్ణు" అనుకున్నాడతడు. అంతలోనే బండిలో తన వెనక కేవలం రెండుమూడు అంగుళాల దూరంలో శవం. అదీ చిందర వందరగా కోయబడి ఆదరా బాదరాగా కుట్టబడిన శవం. కేవలం ఒక దళసరి దుప్పటిలో చుట్టబడి ఉన్నదనే విషయం అతనికి తట్టింది. అయినా అతడు ఆ విషయం పట్టించుకోనివాడిలా సన్నగా ఈలవేస్తూ మధ్యమధ్య నెమ్మదిగా 'ఛల్' అంటూ, కళ్ళెంచివరలతో గుర్రంపైన చరుస్తూ కూర్చున్నాడు. ఎదురుగా మళ్ళా చంద్ర బింబం కనిపించింది.

'పల్లెటూళ్ళో సెంద్రుడికీ పట్నవాసంలో సెంద్రుడికీ ఎంతతేడా?'

పల్లెటూళ్ళో నువ్వెటన్నా వెళ్ళు, ఎంత దూరమైనా పరుగెత్తుకుపో—పొలాలగట్ల వెంట, తాటి తోపులవెంట, చెరువుగట్టు వెంట; ఎటన్నా పరుగెత్తుకుపో....చంద్రు

డు నీ వెంటనే వస్తాడు. ఈతతోపు, తాటితోపులో నీ వంకనే తొంగి తొంగి చూస్తూ చంద్రుడుకూడా పరిగెత్తుకొస్తాడు. ఎక్కడన్నా ఆగి నీళ్ళలోకి చూడు....అక్కడ కూడా ఉంటాడు. ఈ పట్నంలో అట్లా కాదు. జనం చంద్రుణ్ణి చూడరు. చంద్రుడూ వాళ్ళకక్కనిపించడు. ఈ లైట్లక్రింద, తలుపులు బిగించుకుని ఈ పెద్ద పెద్ద యిళ్ళల్లోజనం ఉండిపోతారు. వాళ్ళ యిళ్ళ తలుపులు మూసుకుపోయుంటాయి. లేకపోతే ఆ ద్వారాలకు దళసరి దుప్పట్లలాంటి తెరలుంటాయి.

"....అన్నట్టు ఈ శవాన్ని దుప్పటి సుట్టిపెట్టారుగదా! ఆళ్లు దాన్ని యింటినించే తెచ్చును...."

"ఛల్!"— అనాడు, ఎన్నేళ్ళక్రింటి సంగతో అది రాఘవులుకు బాగాగుర్తు. తనేమో పాకముందు నులకమంచంమీద కాలిమీద కాలేసుకుని పడుకుని, "ఓసి నా మామ!...." అని పాడుతున్నాడు. అప్పుడు ఎంత వెన్నెలో! ఆకాశంలోనుంచి ఎవరో దేవతలు వెన్నెల సంతటినీ భూమి మీదికి కుమ్మరిస్తున్నట్టు....లెక్కలేనంత, కొలవడానికి వీలేనంత, "ఇంత" అని చెప్పడానికి వీల్లేనంత, వెన్నెల....అప్పుడు మా లచ్చిమి కడియాల చప్పుడు వినిపించింది. తాను వెంటనే నిద్రపోతున్నట్టు నటిస్తూ కళ్ళు మూసుకున్నాడు. మా లచ్చిమి పక్కన ఈతాకుల చాపమీద అట్టాగే కూర్చున్నది. ఒకసారి, రెండుసార్లు తలతిప్పి తనవంక చూసిందేమో! తర్వాత పడు కున్నది. గాజులు, తనెప్పుడో తెచ్చినవి, గలగలమని చప్పుడు చేశాయి. తను కళ్ళు తెరిచిచూశాడు, తలక్రింద ఒక చెయ్యి పెట్టుకుని, రెండోచెయ్యి గుండెలమీద వేసుకుని పైకిచూస్తున్నది. "అట్టాగా లచ్చిమిని సూసి ఎన్నాళ్ళయింది?"

"మడిసి సచ్చిపోయింతర్వాత సేతులు రెంటినీ గుండెలమీద పెడతారెందుకో"

"ఛల్! పదవేగు, రమా! లగెత్తు—'

రాఘవులు వెనక్కుతిరిగి తలవంచి చూశాడు. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ బండి వెనకనే సైకిళ్ళు తొక్కుకుంటూ వొస్తున్నారు.

"ఇట్లా జరుగుతుందని కల్లోకూడా అనుకోలేదురా...." ఒక గొంతు,

"ఎవరుమాత్రం ఎట్లా అనుకుంటారు-వేళ తోసు కొచ్చింది....అంతే....అన్నట్టు ఈపాటికి మీ అన్నయ్యకు టెలిగ్రాంఅందే వుంటుంది కదూ! తెల్లవారేటప్పటికి వొచ్చేస్తాడనుకుంటాను..." రెండోగొంతు.

"నువ్వు మామూలు టెలిగ్రాం ఇచ్చావా? ఎక్స్‌ప్రెసా...?" మొదటి గొంతు.

"ఎక్స్‌ప్రెస్..." రెండోగొంతు.

"ఛస్....ఎంత రోడ్డు....ఎన్ని గతుకు లైనాయనా?" అనుకున్నాడు రాఘవులు. అప్పుడుతనేమో నెమ్మదిగా లేచాడు. నులక మంచం కిర్రుకిర్రు మన్నది. మా లచ్చిమి తలతిప్పిచూడలేదు. కదలకుండా నిద్రపో తున్న దానిలా పడుకుని వుంది- "ఓస్ అంతా దొంగనాటకం...." అనుకుంటూ తాను ఆమెపక్కనే కూర్చుని ఆమె మీదికి వంగాడు.

"ఉండవయా ....ఎవరైనా సూస్తారు - నడిబజారు...." అన్నది మాలచ్చిమి సణుగుతున్నట్టు....అదేం పట్నవాసంలో నడిబజారా? పల్లెటూళ్ళో ఎవడి సంగతి ఎవడికిపట్టింది? అక్కడ పొద్దుగూకగానే పిట్టలన్నీ గూళ్ళకు చేరుకుంటాయి. పిల్లామేకా పెద్దాచిన్నా అందరూ చల్లగా ఇంతతిని ఎక్కడివాళ్ళక్కడ సర్దుకుని నిద్రకు పడతారు. బయట జనమే కనిపించరు. అబ్బో! ఈ పట్నవాసం అట్టాకాదు. మరీ రాత్రి పూటకూడా విరగబాటే. ఆమాటకొస్తేపగటి పూటకంటే రాత్రిపూటే అలజడిఎక్కువ. ఈ సినిమాలూ, ఈలైట్లూ. ఈ గందరగోళం....ఈ పట్నం మరీ బరితెగించి విరగబడిపోయే రోగం సానిలాటిది........ "ఇప్పుడెవరు సూసొచ్చారే ఎర్రిమొగమా" అన్నాడు తానప్పుడు. మా లచ్చిమి కురకుర లాడుతూ వొదిగిపోయింది.

"ఈమడిసి బతికినన్నాళ్లా ఏం జేసే వోడో?"

ఎవరు మటుకేం చేస్తారు? తింటారు. తినడంకోసం నానాగడ్డీ కరుస్తారు. పెళ్ళిళ్లు చేసుకుంటారు. పిల్లల్ని కంటారు. పిల్లల కోసం మళ్ళా మరింత గడ్డికరుస్తారు. ఎవరు మాత్రం మరింకేం చేస్తారు?

రాఘవులు బాగాముందుకుజరిగికూర్చుని గుర్రాన్ని అదిలిస్తూ మరోచేత్తో గడ్డం నిమురు కున్నాడు.

"ఎంత సిత్రం! బతికుండంత కాలం మనంత ఈరుల్లేరని రొమ్ములిరుసుకు తిరుగుతాం. అందరూ మనమంటే పేణం పెడతారనుకుంటాం. పెళ్ళాం, పిల్లలని తన్నుకలాడుకుంటాం.... సస్తే, అదే ఈ దీపమారిపోతే, అదే....ఈ గాలికాస్తా తుస్సుమంటే అప్పుడీ పెళ్ళాం పిల్లలూ ఒక్కొక్కడుపేడిచి ఊసుకుంటారు. దాన్తో అంతా సరి........ రెండోరోజే లెక్కలూ, అయిపేజులూ, దావాలు....మొదలు - బతికుండప్పుడుఇంత నీలుగుతా తిరిగిన పెద్దమడిసిని, సెట్టంత వోణ్ణి సన్నీట తానమాడించి బండెడు కట్టెల్తో తగలేసి సేతులు కడుక్కుంటారు. అయిందా, దాంతో మడిసి నీలుగుడంతా సరి...."

రాఘవులు ఎరిగిన మరణం ఒక్కటే. అతని తల్లి అతని చిన్నతనంలోనే, ఊహ తెలీకముందే చచ్చిపోయింది. ఒకనాడు, అతడప్పటికి పధ్నాలుగేళ్ళవాడు; కామందు గారింట్లో పనిమీద ఉండగా ఎవరోవచ్చి చెప్పారు. దాంతో కామందు హడావిడిగా పిల్చి "ఒరేయ్ రాఘవాయ్! ఇంటికిపోరా" అని మరొకతన్ని తోడిచ్చి మరీ పంపించాడు. ఇంటికి పోయేసరికి అతని తండ్రి శవాన్ని ఆ చిన్న తాటాకుల వసారాలో పడుకోబెట్టి ఉంచారు, అప్పుడు రాఘవులు భయపడి పెద్దగా ఏడవటం సాగిస్తే ఇరుగూ పొరుగూ ఓదార్చారు, "కుర్రకుంక భయపడతాడు, అవతలికి తీసుకుపొండి" అని కూడా అన్నారెవరో? అన్ని పనులూ రాఘవులు పినతండ్రి ఒకాయన జరిపించాడు.

"ఛల్"

అదుగో; దూరంగా సినిమాహాలు.... అప్పుడేపైనఅంతవరకూఅందంగా వెలుగుతున్న లెక్కలేనన్ని బల్బులు ఆరిపోయాయి. రెండోఆట వొదిలే వేళ అయినట్టున్నది. ఇదేదో కొత్తసినిమా....జనం మధ్యాన్నంనుంచీ ఒకటే విరగబడి పోతున్నారు.

రాఘవులు నెమ్మదిగా బండినడుపుతూ పోతున్నాడు. ఒక్కసారి గడ్డం సవరించుకుంటూ వెనక్కుతిరిగి చూశాడు. వాళ్ళిద్దరూ కొద్దిదూరంలో సైకిళ్ళమీద వొస్తూనే

ఉన్నారు. బండి హాలుముందు వచ్చింది.

అంతలోనే హాలుముందు తెరిచారు. జనం బిలబిలలాడుతూ హడావిడిగా, ఒకరి నొకరు త్రోసుకుంటూ ప్రవాహం లాగా బయటికి వచ్చారు. అంతటా కోలాహలం. రొద....గొడవ. బండి అదృష్టవశాత్తూ అప్పటికే హాలుగేటువాటి ముందుకు వెళ్ళిపోయింది. రాఘవులు తలతిప్పిచూస్తే వెనక అంతా జన సముద్రం....చెవులు చిల్లులు పడేలా రొద....సైకిలు రిక్షావారి అరుపులు—బేరాలు....

రాఘవులు కళ్ళెంలాగి పట్టుకుని అగి వెనక్కితిరిగి చూశాడు....కనుచూపు మేర అంతటా జనం....లెక్కలేనన్ని తలలు.... అతను బండి దూరంగా తీసుకుపోయి పేవ్‌మెంట్ వక్కన ఆపి కూర్చున్నాడు. తర్వాత గడ్డం నిమురుకుంటూ "ఒక్క బీడీముక్క ఉంటే ఎంతబాగుండు...." అనుకున్నాడు.

ఆ జనసమూహం అయిదారు నిముషాలకు గాని పలచబడలేదు. అందరూ ఎటువారటు వెళ్ళిపోతున్నారు. లెక్కలేనన్ని రిక్షాలు గంటలు "గణగణ" మ్రోగించుకుంటూ వెళ్ళిపోయాయి.

రాఘవులు కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు.పలుచపలుచగావున్న ఆ జనంలో ఆ వ్యక్తులిద్దరిజాడా ఎక్కడా లేదు. కళ్ళెం చేతిలోపట్టుకుని రెండోచేత్తో గడ్డం నిమురుకుంటూ ఉండిపోయాడు. ఎందుకో అకారణంగా చేతివ్రేళ్ళు వొణుకుతున్నాయి. అలా గడ్డం నిమురుకుంటూనే "ఏమిటో! దేవుడు మొగాళ్ళకీగడ్డం ఎందుకుపెట్టాడో ఖర్మ." అనుకున్నాడు. తర్వాత ఎవరో జంట రిక్షాబేరమాడుకుంటూ ఉంటె అటే చూస్తూ కూర్చున్నాడు. వాళ్ళకు బేరం కుదరలేదు. రిక్షావాడు తలఅడ్డంగా వూపుతూ వెళ్ళిపోయాడు. ఆమెపక్కకు తిరిగిచూసి భర్తతో "పోనీ ఆ జట్కా వస్తుందేమో కనుక్కోండి...."అన్నది. ఆయన రాఘవులువంక తిరిగి చెయ్యి వూపుతూ పెద్దగా "ఏమయ్యా! బండీ కడతావా!" అని అడిగాడు.

రాఘవులు ఉన్నట్టుండి ఉలిక్కిపడి "లేదుబాబయ్యా .... బండి రాదు ...." అన్నాడు. ఆమె ఒక అడుగు ముందుకు వేసి భర్త చేయిపట్టుకుని "మంచిదే.... హాయిగా వెన్నెల్లో నడిచిపోదాంపదండి" అన్నది. "అవును....అదేమంచిది. పద" అన్నాడాయన భార్యచేయిపట్టుకుని ముందుకు నడుస్తూ.

రాఘవులు ఆ వెళ్ళిపోతున్న యిద్దరినీ చూస్తూ కొన్నిక్షణాలు గడ్డం నిమురుకుంటూ ఉండిపోయాడు, తర్వాత మళ్ళీ కళ్ళు పెద్దవిచేసుకుని ఆ సైకిళ్ళకోసం చూశాడు. వాళ్ళజాడలేదు. ఒక పోలీసు మాత్రం చేతిలో లాఠీ వూపుకుంటూ నడిచి వస్తున్నాడు.

ఉన్నట్టుండి అతనిగుండెలు జల్లుమన్నాయి. ఒళ్ళుజలదరించింది. చేతుల వ్రేళ్ళు వొణుకుతున్నాయి.

ఆ పోలీసు నేరుగా బండిదగ్గరికి వొచ్చి "ఏరా ఊరికే ఉన్నట్టున్నావు. నన్ను మా యింటిదగ్గిర దిగబెట్టి వొద్దువుగానిరా" అన్నాడు. తర్వాత రాఘవులను ఏమీమాట్లాడనివ్వకుండానే వెనక్కి వచ్చి "అరె ఎవరో పడుకుని ఉన్నట్టున్నారే .... జబ్బు మనిషాఏం? నీమంప తెగ. చెప్పవేంరా! నీ కెంత పొగరురా — అంతేలే. రోజులాగావున్నాయ్." అంటూ చేతికర్ర తిప్పుకుంటూ వెళ్ళిపోయాడు.



రాఘవులు మళ్ళీ వీధిచివరి వరకూ చూపులు సారించాడు.

ఆ యిద్దరి జాడలేదు.

అతనిగుండెలు మళ్ళీ జల్లుమన్నాయి. మళ్ళీ ఒళ్ళు జలదరించింది. మళ్ళీచేతుల వ్రేళ్ళు వొణకడం ప్రారంభించాయి. అతడు గుర్రాన్ని అదిలించి హాలుముందుగా మళ్ళీ బండిని నడిపించాడు. అంతలో హాల్లోనుంచి ఎవరోవ్యక్తివచ్చి "ఏయ్ జట్కా! ఇటురావయ్యా" అని పిలిచాడు. రాఘవులు వినిపించుకోకుండా ముందుకు సాగాడు. ఆ వ్యక్తి "ఎవడ్రానువ్వు? పిలుస్తుంటే వినిపించుకోకుండా పోతావు" అని సణగడం వినిపించింది.

రాఘవులు వొణుకుతున్న వ్రేళ్ళతో గడ్డం నిమురుకుంటూ, ఒకచేత్తో కళ్ళెం చివరలుపెట్టి గుర్రాన్ని అదిలిస్తూ ముందుకుసాగిపోయాడు. అలా నెమ్మదిగా ఆ హాలు చుట్టూఉన్న వీధులలో ప్రదక్షిణం చేశాడు. ఎక్కడా ఆ సైకిళ్ళ జాడగాని ఆ వ్యక్తుల జాడగాని లేదు.

ఈ వీధిలో పోలీసుస్టేషనుంది. రాఘవులు వీధిచివర బండిఆపి చూశాడు. పోలీసుస్టేషను ముందు రెండు సైకిళ్ళున్నాయి. అతడు 'అమ్మయ్య' అనుకుని నిట్టూర్చి గుర్రాన్నిఅదిలించి పోలీస్‌స్టేషను ముందుకువచ్చి బండినిలిపాడు. తర్వాత బండిదిగి నిలబడ్డాడు. "ఆళ్ళే అయ్యుంటారు. ఆ జనంలో బండితప్పిపోయేటప్పటికి యేశనుకొచ్చి చెప్తావుండారేమో" అనుకున్నాడు.

ఒక్క నిమిషం గడిచింది. అంతలో పోలీసుస్టేషనులోనుంచి యిద్దరువ్యక్తులు వచ్చి సైకిళ్ళెక్కి 'రివ్వు'న వెళ్ళిపోయారు. రాఘవులు హతాశుడై పోయాడు. అంతలో మళ్ళీ గుండెలు జల్లుమన్నాయి. వొళ్ళంతా వెల్లా వొణికింది. త్వర త్వరగా బండి ఎక్కి వేగంగా నడుపుకుంటూ వీధి చివరకు వెళ్ళిపోయి అక్కడ దీపస్తంభంక్రింద ఆగి ఊపిరి పీల్చుకున్నాడు.

తర్వాత వ్రేళ్ళతో గుర్రంజూలు నిమురుతూ నిలబడ్డాడు. ఉన్నట్లుండి బండ్లోకి చూశాడు. శవం! తెల్లని దుప్పటిలో చుట్టబడివున్నశవం! కదలలేని మెదలలేనికట్టె. రాఘవులు చూపులు తిప్పుకుని ఆకాశం వంక చూశాడు. నల్లని మబ్బుఒకటి చంద్రబింబాన్ని కబళించబోతున్నది. క్షణాలమీద చంద్రుడికాంతి మాయమై వీధిదీపం వెలుతురే మిగిలిపోయింది.

ఆ పక్కయింటి గేటు తెరిచారెవరో. రాఘవులు అటుచూశాడు. ఒక నడివయసు వ్యక్తి కళ్ళజోడుసర్దుకుంటూ "ఏమయ్యా జట్కావొస్తుందా? స్టేషనుకుపోవాలి. ఏం తీసుకుంటావు.? నలుగురు మనుషులు." అన్నాడు. రాఘవులు ''బండిరాదుబాబూ!"

తుంటూ గుర్రాన్ని అదిలించాడు; మళ్ళీ మళ్ళీ ఆ నాలుగు వీధులలోనే తిరిగాడు. ఎక్కడా ఆ మనుషుల జాడలేదు.

జైలుగోడ ఆ గుడ్డి వెన్నెలలో భయంకరంగా వుంది. అటువైపు ఎన్నిగదులున్నాయో! వాటిల్లో ఎందరు నిరాశ్యులున్నారో! రాత్రిళ్ళు వాళ్ళు గదుల్లో లైట్లుంచుతారా? ఈ జైల్లో ఆడఖైదీలు కూడా వుంటారా? ఆడఖైదీలనూ మగఖైదీలను విడివిడిగా వుంచుతారా లేక ఒకే చోట వుంచుతారా? ఏమోమరి....

జైలుగోడ అవతలివైపునుంచి గంటలు మ్రోగుతున్నాయి. రాఘవులు శ్రద్ధగా విన్నాడు. రెండు గంటలు మాత్రం మ్రోగాయి. తర్వాత అంతటా నిశ్శబ్దం. ఏదో తెల్లని పక్షి 'క్రీక్' మని అరుస్తూ జైలుగోడ మీదుగా ఎగిరిపోయింది.

అయ్యో! ఎంతపని జరిగింది? ఇలా జరగకుండా ఉంటే తానీపాటికి హాయిగా గుడిసెకు చేరుకుని యిన్ని గంజినీళ్ళు గొంతులో పోసుకుని తొంగుని వుండేవాడు. తాను రోజూ పాకలో కుడివైపు చినుపల చాపమీద పడుకుంటూ వుంటాడు. కప్పులో సరిగ్గా అదేచోట పెద కన్నం ఉంది. కప్పునిండా చాలా చోట్ల చాలా రంధ్రాలున్నాయి గాని దీనిసంగతి వేరు. చంద్రుడి కిరణాలు సరిగ్గా అర్ధరాత్రి వేళకు తాను వెల్లికిలా పడుకుంటే తన గుండెలమీద పడుతూవుంటాయి.

రాఘవులు మళ్ళీమళ్ళీ ఆ వీధులన్నీ తిరిగాడు. గుర్రం నీరసంగా అడుగులు వేస్తూనే వుంది. అతడు వొణుకుతున్న కళ్ళతో మాటిమాటికీ గడ్డం నిమురుకుంటూ కూర్చున్నాడు. ఉండిఉండి బండి వేగం బాగా తగ్గినప్పుడు 'ఛల్ ఛల్' అని గుర్రాన్ని అదిలిస్తున్నాడు. తర్వాత ఉన్నట్టుండి నీరసపడిపోయాడు. ఎందుకో కళ్ళు తిరిగాయి. తలగుడ్డ తీసి విదిలించి మొహం తుడుచుకున్నాడు. తర్వాత తాను పొద్దుగూకగానే యింటికి పోనందుకు తన్ను తాను నిందించుకున్నాడు. "ఛీ! బుద్ధి గడ్డితిని ఈ బేరానికొప్పుకున్నాను. ఇయ్యాళ పొద్దున్న లెగవంగానే ఎవరి మొగం సూశాన్రా దేవుడా?" అనుకున్నాడు.

రెండు మూడు నిమిషాలసేపు ఆలోచించినా తాను పొద్దున లేచీలేవగానే ఎవరి మొహం చూశాడో గుర్తు రాలేదు. నిన్న రాత్రి అసలు పడుకున్నదెక్కడ? స్టేషను కనీ, బస్సు స్టాండుకనీ, సినిమాహాళ్ళ దగ్గరకనీ ఒకటే తిరగడం తప్ప పడుకున్నదేలేదు...

నిమిషాలు గడిచిపోతున్నాయి. గుర్రం నీరసంగా బండిని లాగుతూ మళ్ళీమళ్ళీ ఆ వీధులలో తిరిగింది. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ఉండిఉండి ఎక్కడో కుక్క అరుస్తున్న సప్పుడి....చంద్రబింబం మబ్బులలోకి వెడుతూ, మళ్ళీ బయటికి వొస్తూ దోబూచు లాడుతున్నది. వెన్నెల చల్లచల్లగా మెత్తమెత్తగా లోకంమీద కురుస్తున్నది.

రాఘవులు ఒకచోట ఆగి ఆలోచించాడు. అతన్ని నీరసం ఆవహించింది. కాళ్ళూచేతులూ కొంగర్లు పోతున్నాయి. కళ్లు మండుతున్నాయి. తల దిమ్మెక్కిపోతున్నది. చూడగా చూడగా యిదంతా ఒక కుట్రలా కనిపిస్తున్నది. తాను దురదృష్టవశాత్తూ ఈ కుట్రలో చిక్కుకుపోయాడు. అతడు మళ్ళీ బండిలోకి చూశాడు. అదృష్టవశాత్తూ ఇదంతా ఒక కల అయివుంటే, బండిలో ఆ శవం లేకపోతే ఎంతబాగుండును' అనుకున్నాడు. కాని ఆ శవం బండిలో భద్రంగా ఉంది. చెక్కుచెదరకుండా ఎలా పడుకోబెట్టబడిన శవం అలాగే ఉంది.

రాఘవులు నుదురు తుడుచుకున్నాడు. కళ్లు తుడుచుకున్నాడు. తర్వాత ఒక నిర్ణయానికి వచ్చి తల పంకించాడు. గద్దలాగ కళ్ళు కుంచించుకుని అటూ యిటూ చూశాడు. నిశ్శబ్దంగా అన్నీ యిళ్ళు... అంతటా నిశ్శబ్దం. అతడు గుర్రాన్ని నెమ్మదిగా నడిపిస్తూ ఒక ఇంటిముందుకు వచ్చాడు. ఆగి ముందువెనుకా చూశాడు. కనుచూపుమేర ఎక్కడా నరసంచారం లేదు ఇది ఎలాటిచోటు అనుకుని బండి దిగి ఒక్క క్షణం నిలబడ్డాడు. తర్వాత ఎదురింటివైపు చూశాడు. ఆ యింటికి ముందు ప్రహరీకి ఆనుకుని అరుగులున్నాయి. అంతా మంచివాటంగా ఉంది. అనువుగా ఉంది.

రాఘవులు "మరింకేం చేస్తాం? తప్పదు" అనుకుంటూ బండివెనక్కు వచ్చి మళ్ళీ ఒకసారి ముందూ వెనకలు చూసి తర్వాత శవాన్ని రెండు చేతులతో దింపబోయాడు.

అంతలో ఏదో శబ్దం వినిపించగా అతని గుండెలు జల్లుమన్నాయి. హడావిడిగా శవాన్ని మళ్ళీ లోపలికి తోసేశాడు. ఆ యింటిలోపలి తలుపులు తెరుచుకుని వీధిలోకి వచ్చారెవరో....రాఘవులు అటు చూశాడు. ఆ మనిషి ఎవరో లోపలినుంచి పెద్ద పనివున్న వాడిలాగా తలుపులు తెరుచుకుని వచ్చి నేలమీద ఉమ్మేసి గుమ్మం ముందే అటూ యిటూ పచార్లు చేయడం ప్రారంభించాడు.

రాఘవులు నీరసంతో నిట్టూర్చి మళ్ళీ బండి ఎక్కి నీరస స్వరంతో 'ఛల్' అన్నాడు. గుర్రం నీరసంగా అడుగులు వేయడం ప్రారంభించింది.

మరోచోట మళ్ళీ అదే ప్రయత్నం చేయబోతూవుంటే ఆ యింటి ఆవరణలోనుంచి పెద్దపులిలా ఉన్న కుక్క ఒకటి "భౌభౌ" అని అరిచింది. అంతలో లోపలినుంచి "ఏయ్ టామీ" అని అదిలించారెవరో.

అక్కడా తన ప్రయత్నం ఫలించక రాఘవులు మళ్ళీ ముందుకుసాగాడు. క్రమంగా అతన్ని నిస్సత్తువ పూర్తిగా ఆవరించింది. కాళ్ళూ చేతులూ వొణుకుతున్నాయి. తనవెనక బండిలో ఇన్ని సంవత్సరాలుగా ఎవరెవరో (బతికివున్న మనుషులు) నిక్షేపంగా కబుర్లాడుకుంటూ గలగల నవ్వుతూ కూర్చుని ప్రయాణం చేశారేగాని యిలాటిదెన్నడూలేదు. తన వెనక ఒకశవం ఉన్నదనే విషయం తలుచుకుంటేనే అతనికి భయంగా, కంగారుగా, నీరసంగా, ఉంది.

అమ్మయ్యో! నిక్షేపంలాటి ఆర్రూపాయలు గాలికి పోయినట్టయింది. ఇంటిమొహంచూసి యిరవైనాలుగ్గంటలు దాటింది. నిద్రలేదు, తిండిలేదు, మనశ్శాంతిలేదు, పైగా భయంతో వొళ్ళు బిగదీసుకుపోతున్నది. మొహాన మాటిమాటికీ చెమటపడుతున్నది.

మళ్ళీ జైలు గోడపక్కగా వొస్తూవుంటే మూడుగంటలు వినిపించాయి. ఆ గంటలు పరిసర నీరవ ప్రకృతిలో

ప్రతిధ్వనించాయి. అదీ కొద్దిక్షణాలే.... అంతలో మళ్ళీ అంతా నిశ్శబ్దం.

రాఘవులు బండి నడుపుతూనే వున్నాడు. ఆ వీధిచివర లాంతర స్తంభం క్రింద ఒక్కక్షణం ఆపి మొహం ముడుచుకుని "అమ్మయ్యో" ఈ నరకం పగవాడికికూడా వొద్దురా దేవుడా!" అనుకున్నాడు. తర్వాత తనకున్న పగవాళ్ళెవరో గుర్తు చేసుకునేందుకు ప్రయత్నించాడు. అవును. ఇటీవల ఎవరూలేరు? కాని తన చిన్నతనంలో తనతండ్రిని ఒకనాడు నడిబజార్లో నిలబెట్టి అప్పుపుచ్చుకున్న పాతిక రూపాయలూ గడువులోగా ఇవ్వలేకపోయినందుకు నానాబూతులూ తిట్టి లోకువగా దొరికాడని చావబాదిన నారాయణ గుర్తుకువచ్చారు. వాడు పేసమోసి కౌడీ— అందరికీ వాడంటే హడల్.... అలాంటి కిరాతకుడి దగ్గర అప్పుతీసుకోడం అతని తండ్రిదేతప్పు....కాని అతనితండ్రికీ ఒక బలహీనతవుంది. వేళకు నల్లమందులేకపోతే బతకలేడు. అందుకే అప్పు చేశాడు. ఆనాడు గొడవ జరిగినప్పుడు చేతిలో రెండుమూడు ఉప్పుచేపలతో తానుకూడా అక్కడే ఉన్నాడు. తండ్రిని కొడుతూవుంటే తాను పెద్దగా కేకలుపెట్టి "అయ్యో! అయ్యో అని ఏడ్చాడు. అప్పుడే అనుకున్నాడు" ఈ నారాయణ తనకు శత్రువు. ఎప్పుడైనా ఎలాగైనా సరే వాడిమీద పగ తీర్చుకోవాలి.' అని. కాని తర్వాత తనకు ఆ అవకాశము రాలేదు. తండ్రి మంచాన పడటం, తాను ఎక్కడో చాకిరీకి కుదరటంతో ఆ విషయం అడుగునపడిపోయింది. వాడొక్కడె ఎప్పటికీ యిప్పటికీ తనకు పగవాడు. ఇప్పటికి బాగా ముసలివాడై పోయిఉంటాడు. లేకపోతే చచ్చిపోయికూడా ఉండవచ్చు. వాడొకవేళ బతికిఉన్నాసరే, దేవుడా, ఇల్లాంటి నరకం వాడికూడావొద్దు...

తర్వాత రాఘవులు తాను బండిదిగి నడుస్తూ గుర్రాన్ని నడిపించుకుంటూ కొంతదూరం వచ్చాడు. తర్వాత "పోలీసు పదమటిలంక వెళ్ళిపోతే...." అనుకున్నాడు. కాని అదిచాలా తెలివి తక్కువ అనిపించింది. రాఘవులు దూరంగా పోలీసుస్టేషనుచూశాడు, ఇక ఒకటే మార్గం తోచింది. పోలీసుస్టేషనుకు వెళ్ళడం.... సంగతంతా చెప్పేయటం....శవాన్ని దింపి పోలీసులస్వాధీనం చెయ్యడం.... అవసరమైతే తన పేరూ యింటిగుర్తూ చెప్పెయ్యడం.... నదోవన తాను పోవడం.... ఇలా చేస్తే మంచిది.

అతడు మొహం తుడుచుకుంటూ ముందుకునడిచాడు. పోలీసులు తనను ఒక పట్టాన కదలనివ్వరేమో, "నీ మాటలు నమ్మాలని ఎక్కడుంది? మేము అంతా విచారించేదాకా ఇక్కడేఉండు." అని తనను కొట్లోపెట్టేస్తే-అయినా ఈ చెరకంటె అదే నయం. లోపల హాయిగా పడుకుని నిద్రపోవచ్చు-ఏ దిగులూలేదు-

పోలీసుస్టేషను పదిగజాల దూరంలో వుంది. వాకిట్లో మెట్లమీద ఒక పోలీసు తలమీద టోపీలేకుండా కూర్చునివుండి బీడీకాబోలు కాలుస్తున్నాడు.

అతనికి చిన్నతనంలో ఒకస్నేహితుడుండేవాడు. వాడిపేరిప్పుడు గుర్తులేదు. వాడు చిన్నతనంనుంచీ దొంగతనాలు చేయడంలో జేబులు కొట్టడంలో ఆరితేరినవాడు. మరీచిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడే తల్లితో ఆమెపనిచేసే యిళ్ళకువెళ్ళి అవీయివీ దొంగిలించుకు వచ్చేవాడు. క్రమంగా దొంగబుద్ధి అలవడింది. ఎప్పుడూ ఏదో ఒకటి, ఎక్కడో ఒకచోట దొంగిలించుకువస్తూ ఉండేగాడు. ఎప్పుడైనా అడపాదడపా పట్టుబడితే కిమ్మనకుండా రెండుతన్నులుతిని, కొద్దిరోజులు జైల్లోగడిపి వచ్చేవాడు. అప్పుడప్పుడూ "యింటికంటె గుడిబద్రంరా శివా! జైల్లో యాళకింత తిండీ.నిద్రా-ఇంట్లో ఏముంది?" అనేవాడు. వాడువేసే వేషాలకూ చేసే మోసాలకూ అంతుండేది కాదు. ఒకసారి ఎవడో దిక్కులేనోడు చచ్చిపోతే ఆ కట్టెను రోడ్డుమీద పడుకోబెట్టి గుడ్డకప్పి వొచ్చేపోయే వారందరితోనూ "మావోడే బాబూ! తగలెయ్యడానిక్కానీ కబ్బులేదు. మారాజులు దయదల్చండి-" అని అడుక్కుని పదిరూపాయలు సంపాయించాడు. తర్వాత ఆశవాన్ని అలాగే వొదిలేసి పారిపోయి వొచ్చేశాడు. "పాపం! శవాన్నేంజేశావురా? అని అడిగితే "ముంసిపాలిటోళ్ళు తీసుకుపోతారెళ్లు-" అన్నాడు,

రాఘవులు కాళ్ళకు బ్రేకువేసినట్టయింది. ఎందుకో ఉన్నట్టుండి ఆగిపోయాడు అతనికళ్ళు పెద్దవైనాయి. ముందునుదురు తుడుచుకుని "ఛఛ" అనుకున్నాడు. "పాపం కట్టికుడుప్పద్ది-" అనుకున్నాడు, తర్వాత "అ(! పాపంలేదు పున్నెంలేదు. అళ్ళు ఆ(రూపాయలకు బేరమాడి నాకు మస్కా-వేశారుగా-" అనుకున్నాడు. తర్వాత బండిఎక్కి గుర్రాన్ని అదిలించి వేగంగా పోలీసు స్టేషనుదాటి, సినిమాహాలు దాటి, జైలుగోడదాటి ఒక పాడుబడిన షెడ్డుకువచ్చాడు. అక్కడ గుర్రాన్ని విప్పికట్టేశాడు, బండ్లోనుంచి లేచి దాని ముందింత గడ్డిపడేశాడు, బండిని గుర్రాలు నీళ్ళుతాగే తొట్టిమీద ఆనించాడు. తలగుడ్డతీసి క్రింద పరుచుకుని ఆవులించి చిటికెవేశాడు. తర్వాత పక్కకు చూస్తే ఎవరో దిక్కులేనివాళ్లు అక్కడ పడుకుని ఉండి కనిపించారు. ఒక పసిపిల్లవాడు ఏడుస్తుంటే తల్లి మేలుకొని సముదాయించింది. తర్వాత గుర్రం గడ్డినెమరేస్తున్నచప్పుడుతప్ప అంతానిశ్శబ్దం-రాఘవులుకు అంతలో కళ్ళుమూతలు పడ్డాయి కొద్ది నిమిషాల్లో అతని వొళ్ళు అతనికి తెలీదు.

తెల్లగా తెల్లవారింది. మనుష్యులప్పుడే మసలడం ప్రారంభించారు.

అంతలో రాఘవులు లేచికూర్చున్నాడు, తర్వాత కళ్ళు నులుముకుని తలగుడ్డ చుట్టుకున్నాడు. మనిషిలో కొంత సత్తువ వచ్చింది.- చేతివ్రేళ్లువిరుచుకుని ధైర్యంగా లేచినిలబడ్డాడు.

తర్వాత హడావిడిగా పని ప్రారంభించాడు, శవాన్ని బండ్లోనుంచి లేపి భుజం మీద వేసుకున్నాడు. ఈ మనిషి తేలిగ్గానే వున్నాడు. భుజంమీద వేసుకుని మొయ్యడం పెద్దకష్టంగా ఏమీలేదు.

రాఘవులు అలా భుజంమీద ఆకట్టెతో కొద్దిదూరం నడిచాడు. వీధినపోతున్న ఒకరిద్దరు అతనివంక విచిత్రంగా చూశారు. అతడు ఏమీ పట్టించుకోలేదు. ఇదుగో ఈ చోటుమంచిది. నాలుగువైపులనుంచీ జనం వస్తారు. రాఘవులు అక్కడఆగి శవాన్ని భుజంమీదినుంచి దింపాడు. పేవ్‌మెంట్ మీద సరిగ్గా పడుకోబెట్టాడు.

దుప్పటి సరిగ్గా సర్దాడు. తర్వాత శవం మొహం కనిపించేలా దుప్పటి తొలగించి మడతపెట్టాడు. అప్పుడే అతడూ ఆ మొహం చూశాడు. ఆ మనిషి పచ్చని వాడే. గడ్డం మరీ చావుకుముందే గీసుకున్నట్టుగా నున్నగా వుంది. బలంగానే ఉన్నాడు. మరి నిరంతరం తాగేవాడు. బలహీనంగా వుండక వస్తాదులా ఎలా ఉండగలడు? బతికున్నప్పుడు ఏంచేసేవాడో-ఏమో!

ఇంతలో రాఘవులు తలమీది గుడ్డతీసి విదిలించి అక్కడనిలబడిన యిద్దరు ముగ్గురు వ్యక్తులను ఉద్దేశించి "అయ్యా! బాబూ, ధర్మదాతలు-ఈడు దిక్కులేనోడండి-నిన్ననే సచ్చాడు బాబూ! ఒకప్పుడు బాగా బతికినవాడే-ఇప్పుడు తగలేసేందుక్కూడా లేకుండాపోయింది బాబూ! తోచింది ధర్మం సెయ్యండి- పుణ్యం ఉంటుంది!" అన్నాడు. వారిలో ఒకవ్యక్తి ఒక పావలా నాణెం, మరొకాయన పదిపైసల నాణెం అతని చేతిలో పడేసి వెళ్ళిపోయారు.

"అరె! బాగానే ఉంచేవరన్-" అనుకున్నాడు రాఘవులు. జనంకూడా ఆ అనాథ ప్రేతాన్నిగురించి ఆగి మరీవిని నిట్టూర్చి దయతో తోచినంత పడేసి పోతున్నారు. రాఘవులు విజృంభించాడు. ఆ చచ్చిపోయిన మనిషినిగురించి ఎన్నో వివరాలు చెప్పాడు. చెప్పింది చెప్పకుండా చెప్పాడు. అంతలో సూర్యోదయమై ఎర్రని బంగారు రంగుఎండ వచ్చింది. ఆ ఎండతో చురుకుపాలు హెచ్చింది. జనం రాకపోకలు బాగా ప్రారంభమైనాయి. పేవ్‌మెంట్ పక్కన జనం ఆగి తోచినంత రాఘవులు చేతిలో వేసి మరీ వెళ్ళిపోతున్నారు. రాఘవులు చేయినిండిన డబ్బులను బనీనులోపలి వైపునఉన్న జేబులో వేసుకున్నాడు. మళ్ళీ చేయినిండిపోతున్నది. ఆ చిల్లర డబ్బులలో అర్ధరూపాయిలూ, పావులాలూ, పదిపైసలూ, ఇంకా యితర నాణేలూ చాలా ఉన్నాయి. జనం కొంచెం పలుచబడ్డారు.

రాఘవులు అంతసేపటినుంచీ అక్కడే ఏమీతోచక కాబోలు నిలబడిన ఒక మనిషిని గమనించాడు. అతడు మాసిన దుస్తుల్లో వున్నాడు. రాఘవులు అతనివంక తిరిగి "బాబూ! నిన్నటాలనించీ తిండిలేదు. అట్టాపోయి గొంతులో కాసిని కాఫీనీళ్లు పోసుకొస్తాను." అని చెప్పాడు.

తర్వాత వెనుదిరిగాడు.

"ఇ సలు, అర్రూపాయలు గిట్టుబాటయివుంటాయ్! పోనీకొంచెం తగ్గించే అనుకో-పోన్లే-ఇక ఎళ్ళిపోదాం-" రాఘవులు ఒక అడుగు ముందుకు వేశాడు. అంతలో అతని వీపుమీద దెబ్బ పడింది, ఎవరో మెడదగ్గర బనీను గట్టిగా పట్టుకున్నారు. రాఘవులు ఉలిక్కిపడి తల తిప్పేసరికి 'దొంగముండాకొడకా' అని తిట్టు వినిపించింది. అదేక్షణంలో మొహం మీద గట్టి దెబ్బపడింది. రాఘవులు క్షణంలో సగంలో ఆ మొహంచూశాడు. వెంటనే మొహం చప్పున రెండో దెబ్బ కాచుకోబోయాడు ఏదో మాట్లాడబోయాడు. కాని అంతలో అతనిమీద దెబ్బలవర్షం మొదలైంది. "బేవార్సువెధవా! ఇంత మోసం చేస్తావురా. నీ ప్రాణాలు తీసేస్తాం- అంత బతుకూ బతికిన మా నాయన్ని అనాథనుచేస్తావా? ఆయన్ని తగలెయ్యడానికి కూడా డబ్బుల్లేని దిక్కులేని చావు చచ్చాడా? ఏం దుర్బుద్ధికి."

"ఊరికే కోదమూ? రాత్రల్లా సైకిళ్ళమీద ఊరంతా వెదకలేక ఛస్తేను. ఈ రాస్కెల్ కావాలనే యిలా చేశాడు—దగాకోర్...." అని సమాధానం....

దెబ్బలు! దెబ్బలు! రాఘవులునోరు చివరపెదవులు చిట్లి రక్తం కారుతున్నది. బనీను చినిగి పీలికలయిపోయింది. జుట్టు పట్టుకుని లాంచి వాళ్ళిద్దరూ అతన్ని బాదిపారేశారు. డబ్బులు రోడ్డుమీద చిందరవందరగా పడిపోయాయి. "అమ్మో! నాకేం తెలవదుబాబూ! రాత్రిమీరే కనిపించకుండాపోయి-అమ్మో! కొట్టకండి బాబయ్యా! కాళ్ళట్టుకుంటాను-"

జనం గుంపుగా చేరారు. అంతావిని అర్థంచేసుకుని నివ్వెరపోయారు. "ఇట్లాంటి దగుల్బాజీలుండబట్టే లోకం యిలా తగలబడింది- నాలుగు తగల్నివ్వండి, లేకపోతే పోలీసుల కప్పజెప్పండి-" "అట్లాకాదు. పోలీసులేంచెయ్యరు. మనమే నాలుగు గట్టిగా తగిలించి పంపిస్తే మంచిది. ఇహ మీదట ఇట్లాంటి పాడుపన్లు చెయ్యకుండా-" "అరె! అయినా యింతింత తెలివితేటలు పుడుతున్నాయేం జనంలో!"

రాఘవులు అలాగే ఒక్కనిముషం పడుండిపోయాడు. లేవలేక పోయాడు. ఒక్కనిముషం తర్వాత చేతులు నేలకానించి బలమంతా కూడదీసుకుని లేచాడు. చుట్టూ చూశాడు, జనం ఎటువారటు. వెళ్ళిపోయారు. ఆ యిద్దరూ శవాన్ని అద్దెకారులో వేసుకుని వెళ్ళిపోయారు. అంతా సద్దుమణిగింది.

రాఘవులు కాళ్ళు వొణుకుతూవుండగా నెమ్మదిగా అడుగులు ముందుకువేశాడు. కళ్ళు బైర్లుకమ్ముతున్నాయి. పెదవుల నుంచి కారుతున్న రక్తం నాలికకు తగులుతున్నది, గొంతులోనుంచి ఏదో పొంగు వొస్తున్నట్టున్నది. గబగబా పక్కకు నడిచి వెళ్ళి రోడ్డుపక్కన వాంతి చేసుకున్నాడు. అయిదు నిమిషాలు అలాగే కూర్చుండిపోయాడు. తర్వాత ఓపికతెచ్చుకుని లేచి చూస్తే సూర్యుడు కరుకుగా తీవ్రంగా తన వాడి కిరణాలతో కళ్ళలో పొడుస్తున్నాడు. చేయి కళ్ళకు అడ్డంవుంచుకుని అతడు కాళ్ళీడ్చుకుంటూ ముందుకు నడిచాడు.

గుర్రం నీరసంగా నిలబడివుంది. రాఘవులు దానిమెడనిమిరాడు. నేలమీద మిగిలిన గడ్డిగాదం తీసి బండ్లో వేశాడు. తర్వాత బండికట్టుకున్నాడు. ఆ తొట్టిలో నీళ్ళతో మొహం కడుక్కున్నాడు, పైగుడ్డతో తుడుచుకుంటూ బండిఎక్కి కూర్చుని గుర్రాన్ని అదిలించాడు.

అతనికి అకస్మాత్తుగా ఏడుపు పొంగి వచ్చింది. గొంతులో దుఃఖం గూడుకట్టుకుని అడ్డుపడ్డట్టు అనిపించింది. గొంతు సర్దుకుని నీరసస్వరంతో 'ఛల్' అని గుర్రాన్ని అదిలించాడు.

పక్కకు చూస్తే సూర్యబింబం అప్పుడే నిప్పులు కురిపిస్తూ తీక్షణంగా, కర్కశంగా పైకివస్తున్నది. అతని కళ్ళముందు నల్లని రింగులు తిరుగుతున్నట్టయింది. చేయి కళ్ళకు అడ్డంఉంచుకొని వాలిపోయి కూర్చుని మళ్ళీ "ఛల్ ఛల్" అన్నాడు.

• • •

నగరం....ఇదిఎంత భయంకరమైన అరణ్యం!

ఇక్కడ ఎంత వెలుతురు!

ఎన్నిరకాల మృగాలు!

□●□